లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

సంక్షేమం,అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

◆ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

◆పాల్తూరులో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-ఉరవకొండ

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యంత్రి చంద్రబాబు నాయుడులోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శనివారం విడపనకల్లు మండలంలోని పాల్తూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక భద్రత పింఛన్లను కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్‌తో కలిసి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ప్రతి నెలా ఒకటో తారీఖున రూ.4వేల పింఛన్‌ను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నామన్నారు. రాబోయే కాలంలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. పాల్తూరు గ్రామంలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో వి.శ్రీనివాసులు రెడ్డి, ఎంపిడిఒ షకీలా బేగం, తహశీల్దార్ టికె.చంద్రశేఖర్, ట్రాన్స్‌కో ఎఇ సత్యంతో పాటు టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పద్దు పొడవలేదు..!

◆ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు నిల్

◆ వెనుకబడిన ప్రాంతాలకు ఒట్టి చెయ్యి..

◆ బడ్జెట్‌పై జనం పెదవివిరుపు

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక బడ్జెట్ నిరాశపరచింది. ఉపాధి, నిరుద్యోగం, పన్నుల భారం తదితర అంశాలపై పెద్దఎత్తున సామాన్యులు ఆశలు పెట్టుకున్నారు. ఇందులో కొన్ని అంశాలను ప్రస్తావించినప్పటికీ నిర్దిష్టమైన ఉపశమనాలేవీ కనిపించలేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ బడ్జెట్‌లో వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు ప్రత్యేకమైన కేటాయింపుల్లేవు. గుంతకల్లు రైల్వే డివిజన్‌కు అరకొరగానే కేటాయింపులు జరిగినట్లు తెలుస్తోంది. కేంద్రీయ విశ్వవిద్యాలయానికి గతంలాగానే చిల్లర విధింపులే జరిగాయి. ఉమ్మడి జిల్లాకు నిధుల కేటాయింపు విషయంలో కేంద్రం మరోసారి పూర్తిగా సీతకన్ను వేసిందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఏర్పాటైన కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధుల కేటాయింపులు లేవనే చెప్పవచ్చు. అంతకు మునుపు ఏడాది కేటాయించిన రూ.112 కోట్లే తప్పా ఈసారి బడ్జెట్‌లో ప్రత్యేకమైన కేటాయింపులేవీ కనబరచలేదు. ముందు కేటాయించిన నిధులతో సొంత భవన నిర్మాణాలు సాగుతున్నాయి. ఇప్పుడు జరుగుతున్న నిర్మాణాల వరకే పరిమితమయ్యే అవకశాలు కనిపిస్తున్నాయి. కొత్త బడ్జెట్‌లో ఒక్క రూపాయి నిధులనూ కేంద్ర ప్రభుత్వం కేటాయించకపోవడం గమనార్హం.

ఉపాధి హామీకి తగ్గిన కేటాయింపులు

అనంతపురం జిల్లా గ్రామీణ ప్రాంతానికి ఎంతో కీలకమైన ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులు తగ్గించేసింది. అంతకు మునుపు ఏడాది బడ్జెట్‌లో రూ.89 వేల కోట్లు కేటాయిస్తే గత బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించింది. ఈసారి అదే మొత్తం కేటాయించింది. గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని బడ్జెట్‌లో నిర్మల సీతారామన్ చెప్పినప్పటికీ కేటాయింపుల్లో పెరుగుదల కనిపించలేదు

ఏపీకి అన్యాయం

కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగింది. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరం. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడడానికి ఏపీ, బీహార్ ఎంపీలే కీలకం. ఇలాంటి తరుణంలో బీహార్‌కు ఒకలా.. ఆంధ్రప్రదేశ్‌కు ఒకలా బడ్జెట్ కేటాయింపులు ఉండడం విచారకరం. ఏపీకి కొత్త ప్రాజెక్టులు సాధించుకోవడంలో సీఎం చంద్రబాబు వైఫల్యం చెందారు. ఎన్డీయే భాగస్వాములుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు సాధించింది ఏమిటో ఆత్మపరిశీలన చేసుకోవాలి.

అనంత వెంకటరామిరెడ్డి,
వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు.

రాష్ట్రానికి తీరని అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసింది. ఇక్కడి ఎంపిల మద్దతుతో అధికారంలోనున్న కేంద్ర ప్రభుత్వం ఈ రాష్ట్రానికి నిధుల కేటాయింపుల్లో మాత్రం తగినంత ప్రాధాన్యతనివ్వలేదు. బడ్జెట్‌లో కనీసం ఈ రాష్ట్రం పేరు కూడా ప్రస్తావించకపోవడం శోచనీయం. అదే బీహార్ మద్దతుతోనున్న చోట మాత్రం కేటాయింపులు జరిపింది. పోలవరం, ప్రత్యేక హోదా అంశాల ప్రస్తావ లేదు. ఇంత అన్యాయం జరుగుతున్నా మద్దతునిస్తున్న కూటమిలోని తెలుగుదేశం, జనసేన పార్టీలు కనీస పెదవి విప్పడం లేదు. దీనిపై ఆ రెండు పార్టీలు ఖచ్చితంగా స్పందించాల్సిన అవసరముంది. వ్యవసాయాన్ని దివాలా తీసే విధంగా ఈ బడ్జెట్ ఉంది. విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రయివేటుకు అప్పగించే కార్యక్రమాలు రాష్ట్రంలోనూ కొనసాగుతున్నాయి. ఈ బడ్జెట్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసింది.

వి.రాంభూపాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు.

నిరాశపరచిన బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకమైంది. రాష్ట్రం నుంచి 25 మంది ఎంపిల మద్దతునిస్తున్నా ఈ రాష్ట్రానికి తగిన ప్రాధాన్యతను బడ్జెట్‌లో కల్పించలేదు. ప్రత్యేక హోదాను విస్మరించింది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాలేవి ఈ బడ్జెట్‌లో లేవు. మొత్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ పూర్తి నిరాశాజనకమైంది.

ఎన్.రఘువీరారెడ్డి, ఎఐసిసి నాయకులు

మాటల్లోనే.. చేతల్లో ఏమీ లేదు

వ్యవసాయ రంగం అభివృద్ధి, గ్రామీణాభివృద్ధి అంశాలను ఆర్థిక మంత్రి ప్రసంగంలో పెద్దగా ప్రస్తావించారు. కనీస మద్దతు ధరపై రైతులు చేస్తున్న పోరాటంపై కనీస స్పందన లేదు. పైగా రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు జరిపే విధంగా ఈ బడ్జెట్ ఉంది. గ్రామీణ ఉపాధికి నిధుల కేటాయింపులు కేటాయింపు తగ్గిపోతూ ఉన్నాయి. అరకొర కేటాయింపులతో ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేపడుతోంది. ఆదాయపు పన్ను మినహాయింపు ఒక్కటే మధ్య తరగతికి కొంత ఊరటనిచ్చే అంశంగా ఉంది.

జాఫర్ సిపిఐ జిల్లా కార్యదర్శి.

బిటిపికి నీరు తీసుకురాలేకపోతే..

'దుర్గం' నుంచి వైదొలుగుతా..

ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

నియోజకవర్గంలోని భైరవాణితిప్ప ప్రాజెక్టుకు తప్పకుండా నీరు అందిస్తానని, లేకపోతే కళ్యాణదుర్గం నుంచి వైదొలుగుతానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని ముద్దలాపురం గ్రామానికి ఏర్పాటు చేసిన నూతన ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పింఛన్ల పంపిణీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ ముద్దలాపురానికి ఆర్టీసీ బస్సు లేకపోవడం బాధాకరమన్నారు. గ్రామస్తుల ఆవేదనను విని బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపోతే రెండేళ్లలో భైరవాణితిప్ప ప్రాజెక్టును పూర్తి చేసి చెరువులకు నీళ్లిస్తామన్నారు. అలాచేయని పక్షంలో ఈప్రాంతవాసులకు క్షమాపణ కోరి వైదొలుకుతానన్నారు. ఈ కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ నీలాస్వామి, నాయకులు కురుగౌడ, చౌలం మల్లికార్జున, గొల్ల వెంకటేశులు, జడ్పిటిసి ప్రభావతమ్మ, మంజుల వన్నూరు స్వామి, ఆర్టీసీ డిఎం రామచంద్రం, స్పెషలాఫీసర్ రజిత, తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ నందకిషోర్, ఎంఇఒ ఓబుళపతి, ఆర్ఐ నాగిరెడ్డి, ఇఒఆర్‌డి రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉంతకల్లు'కు నీరిస్తే రాజకీయ సన్యాసం

వైసిపి సమన్వయకర్త మెట్టు సవాల్

ప్రజాశక్తి-రాయదుర్గం

విప్ కాలవ శ్రీనివాసులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలోని ఉంతకల్లు రిజర్వాయర్‌కు నీరు తీసుకొస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సవాల్ విసిరారు. శనివారం రాయదుర్గంలో తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాలుగు సార్లు రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో పర్యటించి బిటి ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తీసుకురాలేకపోయారన్నారు. కాలవ శ్రీనివాసులు గతంలోనూ, ఇప్పుడూ ఎమ్మెల్యేగా పని చేస్తున్నా ఉంతకల్లు రిజర్వాయర్‌కు తుంగభద్ర నీరు తీసుకురాలేకపోయారన్నారు. అసలు రిజర్వాయరే లేని ప్రాజెక్టుకు తుంగభద్ర జలాలు ఎలా తీసుకొస్తారని ఎద్దేవా చేశారు. మొదట రిజర్వాయర్‌ను నిర్మించాలని సూచించారు. అప్పుడు తుంగభద్ర నీటితో రిజర్వాయర్‌ను నింపితే తాను రాజకీయ సన్యాసం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పాడి రైతులు చిన్న, చిన్న జాగ్రత్తలు తీసుకుంటే అధిక ఆదాయం గడించవచ్చని ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. జాతీయ పశుగణ మిషన్‌లో భాగంగా పాడిపై ఆధారపడి ఉన్న రైతులకు మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో పశువుల్లో వచ్చే వాధ్యులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లేగ దూడలు, పశుఉత్పత్తిని పెంచుకునే వంటి వాటిపై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో రైతులకు ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు డాక్టర్ వినోద్ సెల్..97011 10362, డాక్టర్ గోల్డ్ స్మాన్ సెల్.. 83282 05176, డాక్టర్ రామచంద్రారెడ్డి సెల్.. 87909 97554 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పోలీసుల నాకాబందీ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కోట మారమ్మ గుడి, మల్లాపురం లేఅవుట్, బళ్లారి రోడ్డు ప్రాంతాల్లో పోలీసులు శనివారం నాకాబందీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇన్స్‌పెక్టర్ జయనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు ఇళ్లు, దుకాణాలు, పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా కర్ణాటక అక్రమ మద్యం నిల్వలు, అమ్మకాలపై ఆరాతీశారు. తర్వాత బళ్లారి రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహన చోదకులకు జరిమానా విధించారు. మోటార్ వాహనాల చట్టం గురించి అవగాహన కల్పించారు. నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు.

వాహనాల తనిఖీ

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని ఆర్‌టిఒ కార్యాలయం వద్ద మోటార్ వాహనాల అధికారి వై.విశ్వనాథరెడ్డి వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా వాహనాలు ఫిట్‌నెస్, బీమా, పొల్యూషన్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలను పరిశీలించారు.

పుట్లూరు : మండల పరిధిలోని కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి గ్రామాల్లో సిఐ సత్యబాబు, ఎస్ఐ వెంకట నరసింహ ఆధ్వర్యంలో శనివారం నాకాబందీ నిర్వహించారు. ఇందులో భాగంగా రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లు, కళ్లందొడ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతేగాకుండా గొడవలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయదుర్గం ప్రాంతంలో మహిళలతో మాట్లాడుతున్న పోలీసులు

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన అవసరం

డిఎంహెచ్ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులు, స్కానింగ్ సెంటర్ల డాక్టర్లకు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇవి.దేవి సూచించారు. శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం సమావేశ భవనంలో వైద్య అధికారులు, వివిధ స్కానింగ్ సెంటర్ల డాక్టర్లకు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ స్కాన్ సెంటర్లలో ఎట్టి పరిస్థితుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదన్నారు. ఈరోజుల్లో ఆడపిల్లలు అన్నిరంగాల్లో ముందుంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం 'భేటీ బచావో బేటీ పడావో' అన్న నినాదంతో ప్రజలను మేలుకొలుపుతోందన్నారు. ఆడ, మగ ఇద్దరూ సమానమే అన్నారు. అనంతరం నాగరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టంపై పూర్తి అవగాహన కల్పించారు. ఉమెన్, ఛైల్డ్ సిడిపిఒ శ్రీదేవి, కృష్ణమాచారి పాల్గొని ఆడపిల్లల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, పట్టణ డీఎస్పీ శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమ జీన్స్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ రవిశంకర్, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి : ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గీతకుల కార్మికులకు జనాభా ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో ఈడిగ కులానికి ఒక మద్యం షాపు, గ్రామీణ పరిధిలో గౌడ్ కులానికి ఒక మద్యం షాపులను కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ ఇ.మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతుల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ రూ.2 లక్షల నాన్ రీఫండబుల్ సొమ్ముతో కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వీరికి ప్రభుత్వ లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 7న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు చేస్తామన్నారు.

పింఛన్ల పంపిణీలో తాడిపత్రి టాప్

తాడిపత్రి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీలో తాడిపత్రి మున్సిపాలిటీ మొదటి స్థానంలో నిలిచినట్లు కమిషనర్ శివరామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి మున్సిపాలిటీలో ఉదయం 5.30 గంటలకు ప్రారంభించి 10 గంటలలోపు 9636 పెన్షన్లకు 9110 పెన్షన్లు పంపిణీ చేసి జిల్లాలో 95శాతంతో మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి జాప్యం కలగకుండా కమాండర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షించినట్లు తెలిపారు. అంతేగాకుండా నగరంలోని విజయనగర కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలోని వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు.

ఎరువుల తయారీ కేంద్రం తనిఖీ

ఎరువులను పరిశీలిస్తున్న ఉమామహేశ్వరమ్మ

శింగనమల : మండల పరిధిలోని బండమీదపల్లి గ్రామం వద్ద ఉన్న స్వర్ణ భూమి ఫర్టిలైజర్స్ ఎరువులు తయారీ కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా లైసెన్స్, రా మెటీరియల్ రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లు, సేల్స్ రెగసిటర్, ల్యాబ్ రిజిస్టర్లు, ల్యాబ్, తయారీ మెషినరీ, గోడౌన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఒ అన్వేష్‌కుమార్, టెక్నికల్ ఎఒ బాలానాయక్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభల్లో జిల్లా ప్రతినిధులు

సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు నెల్లూరు నగరంలో శనివారం ప్రారంభం అయ్యాయి. నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్ అనిల్ గార్డెన్‌లో ప్రతినిధుల సభతో మహాసభలు మొదలయ్యాయి. ఈ మహాసభలకు అనంతపురం జిల్లా ప్రతినిధుల బృందం హాజరైంది. జిల్లాకు సంబంధించి నిర్వహించిన చర్చల్లో పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల్లో అనంతపురం జిల్లా ప్రతినిధులు

ర్యాపిడో సర్వీసులను బ్యాన్ చేయాలి

సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా

ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, ఆటో కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆటో కార్మికుల ఉపాధి దూరం చేస్తున్న ర్యాపిడో సర్వీస్‌లను బ్యాన్ చేయాలని సిఐటియు నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ, భగత్‌సింగ్ ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్టీఆర్.శీనా డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు భగత్ సింగ్ ఆటో కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో ర్యాపిడో నిషేదించాలని ప్రచార యాత్ర నిర్వహించారు. ప్రచార యాత్ర తపోవనంలో ప్రారంభమై శాంతినగర్ బోర్డు, నీలిమా సర్కిల్, చంద్ర హాస్పిటల్ సర్కిల్ బస్ స్టాండ్ సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, గుత్తి రోడ్డు ఐదు లైట్లు సర్కిల్ తాడిపత్రి బస్టాండ్, ఆర్‌టిసి బస్టాండ్ సర్కిల్ రైల్వే స్టేషన్ సర్కిల్ వరకు నిర్వహించారు. ర్యాపిడ్‌ను తక్షణం రద్దు చేయాలని, యాప్ ద్వారా ఆటో డ్రైవర్‌ల ఉపాది దూరం అవుతోందన్నారు. ఆటో డ్రైవర్‌లు అందరిని చైతన్యం చేస్తూ ఫిబ్రవరి 3వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, న్యూ టౌన్ కార్యదర్శి ముత్తూజ, భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు వలి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, రాజీవ్ కాలనీ ఉపసర్పంచ్ మసూద్, డివైఎఫ్ఐ నాయకులు నూరుల్లా, బాలకష్ణ, సిఐటియు నగర నాయకులు రాజు, లతీఫ్, వెంకటనారాయణ, ముసలప్ప, గ్రానైట్, టైల్స్ ప్లేయింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎర్రిస్వామి రెడ్డి, తాడిపత్రి బస్టాండ్ హమాలీ యూనియన్ నాయకులు ఆదినారాయణ, నారాయణస్వామి, మురళి, కల్లూరు బాషా, వెంకట్రాముడు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు న్యూ కమిటీ ఆధ్వర్యంలో

ర్యాపిడో సర్వీస్ నిలుపుదల చేయాలని సిఐటియు నగర న్యూ కమిటీ, భవత్ సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రెండవ రోజు పాదయాత్ర నగరంలో నిర్వహించారు. చిన్మయ నగర్ నుంచి జెఎన్‌టియు కళాశాల మీదుగా కలెక్టరేట్, సంగమేష్ సర్కిల్, ఐరన్ బ్రిడ్జి ఆటో స్టాండ్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి ముర్తుజా, ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ ఆజాంబాషా, ఆదినారాయణ మాట్లాడుతూ 3వ తేదిన కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామలింగారెడ్డి, ఆటో యూనియన్ నాయకులు శీనా, రామాంజి, రాజా, గఫూర్, ఉలిగప్ప, నారాయణస్వామి, ఇర్ఫాన్, కెఎస్ఆర్.శీనా, పెరుగోపాల్, గౌస్, నాగేంద్ర, రఘు, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూశారు. తర్వాత విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో వాచ్‌మెన్, రెండు స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే భర్తీ చేయాలని టిడిపి నాయకులు శ్రీనివాసులు, శశాంక్, వెంకటనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహ, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

సూపర్‌వైజర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

సూపర్‌వైజర్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర డైరీని శనివారం స్థానిక రీజినల్ మేనేజర్ కార్యాలయంలో రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆధోని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటిఎం శ్రీలక్ష్మి, లా ఆఫీసర్ చంద్రశేఖర, డిపో మేనేజర్ నాగభుపాల్, డిఇ డి.సురేంద్రబాబు, బిపిఒ డి.చంద్రాయుడు, సూపర్‌వైజర్స్ అసోసియేషన్ సభ్యులు నారాయణస్వామి, రామ్మోహన్, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజినేయులు, హాజీబాషా, నాగార్జున, వెంకటేశ్వర్లు, డి.రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే గారూ... ఇది తగునా'..?!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజాస్వామ్యంలో నాలుగో అంతస్తు మీడియా రంగం. ప్రజా సమస్యలతోపాటు, ప్రభుత్వాల లోటుపాట్లను ఎత్తిచూపడమే మీడియా ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. ఈ లోటుపాట్లను ఎత్తిచూపే క్రమంలో ఏదైనా లోపాలుంటే ప్రజాస్వామ్యయుతంగా నిలువరించే పద్ధతులూ ఉన్నాయి. కాని కొంత మంది నేతలు ఈ పద్ధతులు కాదని... లోపాలను ఎత్తిచూపే ప్రయత్నాలు చేసే జర్నలిస్టులను బెదిరించే ప్రయత్నాలు చేస్తుండటం సహజంగా జరుగుతుంది. ఇది సాధారణంలో అంతర్గతంగా జరుగుతూ వస్తుంటుంది. కానీ జిల్లాలో ఒక ఎమ్మెల్యే మాత్రం అందుకు తాను అతీతమని భావించడం చర్చనీయాంశమైంది. అంతర్గతంగా బెదిరిస్తే ప్రయోజనం లేదని అనుకున్నారో ఏమో... ఏకంగా మీడియా... అధికారుల ముందే బాహాటంగానే బెదిరింపులకు దిగడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తనపై రాసిన వార్తల్లో వాస్తవాలు నిరూపించకపోతే రైలు పట్టాలపై పడుకోబెతానని, తనపై రాసే ముందు ఆలోచించుకోవాలని చెప్పారు. ఇంత బాహాటంగా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అధికార పార్టీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం. గతంలో ఈయన వైసిపిలోనున్నారు. అప్పుడు కార్మిక శాఖ మంత్రిగానూ పనిచేశారు. ఆ సమయంలోనూ ఈయనపై పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో టిడిపిలో చేరి గుంతకల్లు నియోజకవర్గం నుంచి పోటీచేశారు. ఈయన ఇంతలా మాట్లాడిన అధికార టిడిపి అధిష్టానం నుంచి ఎటువంటి చర్యల్లేకపోవడం శోచనీయం. 2024 సార్వత్రిక ఎన్నికల ముందు వరకు టిడిపి ప్రతిపక్షంలో ఉండగా ప్రజాస్వామ్యం, మీడియా స్వేచ్ఛ గురించి గొప్పగానే మాట్లాడింది. అయితే ఇప్పుడు మాత్రం తమ పార్టీ ఎమ్మెల్యే ఇంతలా నోరు పారేసుకున్నా చర్యలేవి లేకపోవడం గమనార్హం. గతంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో అప్పటి వైసిపి జిల్లాలో కొంత మంది జర్నలిస్టులపై ఏకంగా భౌతిక దాడులు జరిగాయి. అప్పుడు ఇప్పటి అధికారపార్టీ దీనిపై ఆందోళనలు చేపట్టింది. ఇలా ఎవరు అధికారంలోనున్న మీడియాపై దాడులు మాత్రం కామన్‌గా మారిపోతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నేతలు అధికారంలోకి వస్తూనే స్వరం మారుతుంది. ఈ వారంలో చోటు చేసుకున్న ప్రధానమైన అంశాలే ఇది ఉంది. ఇక జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో అత్యధిక మంది ప్రజాప్రతినిధులు సమావేశానికి దూరంగా ఉన్నారు. వచ్చిన కొద్ది మందిలోనూ విమర్శలు, ప్రతివిమర్శలతో సమావేశం మొత్తం గందరగోళంగా మారింది. అసలు ప్రజా సమస్యలేవి చర్చకు లేకుండానే ముగిసిపోయాయి.

'రైతు వ్యతిరేక బడ్జెట్'

అనంతపురం కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం శనివారం పార్లమెంట్లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌గా రైతు వ్యతిరేక బడ్జెట్‌గా ఉందని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. 'మద్దతు ధరలు, రుణమాఫీ ప్రస్తావన లేదు. పంటల బీమాకు నిధులు కేటాయింపు లేకపోవడం రైతులకు నిరాశ పరిచింది. అన్నిరంగాలకు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా ఎరువుల సబ్సిడీకి నిధులు కేటాయింపు లేదు.ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమాకు నిధులు కేటాయింపు కోత పెట్టారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి విభజన చట్టంలో చెప్పిన విధంగా నిధులు కేటాయింపు లేదు. అనంతపురం జిల్లాకు హార్టికల్చర్ హబ్‌కు నిధులు కేటాయింపులు లేవు. ప్రధానమంత్రి కిసాన్ సన్మాన్ నిధి కింద ఇస్తున్న రూ.6 వేలు కనీసం ఎకరాకు రూ.10 వేలు 10 ఎకరాల వరకు ఇచ్చే విధంగా బడ్జెట్ సవరించి రైతులను ఆదుకోవడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి'.

రాష్ట్రానికి మొండిచేయి

ఉరవకొండ : కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి మొండిచేయి చూపడం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర బడ్జెట్ సంతృప్తికరంగా లేదన్నారు. ముఖ్యంగా వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు, పేదలు, బడుగు బలహీన వర్గాలకు నిరాశాజనకంగా ఉందన్నారు. మధ్యతరగతి ఉద్యోగులకు ఇన్‌కం టాక్స్ మినహాయింపులు తప్పితే బడ్జెట్‌లో ఏం ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ రంగం వైపు మళ్లించడానికి దారులు పూర్తిగా తెరిచిందన్నారు. మునుపటి బడ్జెట్లతో పోలిస్తే ఈసారి తీవ్ర నష్టం జరిగిందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకోవడమే తప్ప కేటాయింపులు శూన్యమన్నారు.

బీమా రంగంలో వందశాతం ఎఫ్‌డిఐ నష్టదాయకం

రాయదుర్గం : దేశ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో బీమారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 74శాతం నుంచి వందశాతానికి పెంచడం బీమారంగంతోపాటు పాలసీదారులకు నష్టదాయకమని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాయదుర్గం శాఖ నేత బి.కృష్ణభూషన్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. వందశాతం ఎఫ్‌డిఐ అంటే స్వదేశీ భాగస్వామి కంపెనీ లేకుండానే.. ఒక విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీ భారతదేశంలో నేరుగా ఏర్పాటు కావడం అన్నారు. ఇదే జరిగితే దేశంలో 1956కు ముందు పాలసీదారులను ముంచేసిన మోసాలు పునరావృతమవుతామన్నారు. ఎల్‌ఐసిని పరోక్షంగా ప్రభుత్వ విధానం ఈ నిర్ణయం దెబ్బతీస్తుందన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

అనంతపురం రూరల్ : అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంది పంట సాగు చేసిన రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి వేణుగోపాల్, మార్క్‌ఫెడ్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

యాడికి : బిసి కార్పొరేషన్ ద్వారా మంజూరైన సబ్సిడీ రుణాలను మండలంలోని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో బిసి వర్గానికి చెందిన వారు 20ఏళ్ల నుంచి 60ఏళ్లలోపు ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని ముద్దలాపురం గ్రామంలో ఉన్న మెయిన్, మినీ అంగన్వాడీ కేంద్రాలను మండల స్పెషలాఫీసర్ రజిత శనివారం ఆకస్మింగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా చిన్నారులతో కలిసి భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నందకిషోర్, సూపర్‌వైజర్ ఖాసింబీ, అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, చూడామణి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఐటిఐలో టెక్ కార్నర్ ఏర్పాటు

అనంతపురం : నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటిఐలో శనివారం టెక్ కార్నర్‌ను ఏర్పాటు చేసినట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. ఐటిఐలోని డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడ్‌లకు ఆధునిక టెక్నాలజీతో విద్యను అందించాలన్న సంకల్పంతో మహేంద్ర అండ్ మహేంద్ర వారి సహకారంతో సెంటం ఫౌండేషన్ టెక్ కార్నర్‌ని రూపొందించినట్లు తెలిపారు. రూ.4.50 లక్షలతో రూపొందించిన ల్యాబ్ నుంచి ఆన్లైన్ క్లాసులు కూడా వినవచ్చని సెన్టం ఫౌండేషన్ ప్రతినిధి నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ తులసీరాముడు, అధ్యాపకులు ఇషాక్‌బాషా, కృష్ణప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ పునరుద్ధరణకు రూ.కోటి మంజూరు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని డి.కొండాపురంలో ఉన్న పెద్ద తిమ్మప్పస్వామి ఆలయ పునరుద్ధరణకు సర్వశ్రేయోనిధి నుంచి రూ.కోటి మంజూరు చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విప్ కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేస్తున్నట్లు కాలవకు రాసిన ప్రత్యేక ఉత్తరంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి వర్యులు ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

డాక్టర్ శేషకు సన్మానం

కళ్యాణదుర్గం రూరల్ : నియోజకవర్గంలోని నూతిమడుగులో ఆసుపత్రి నిర్మాణానికి స్థలం దానం చేసిన డాక్టర్ శేషను శనివారం పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ శేష ఆసుపత్రి నిర్మాణానికి 1.30 ఎకరాలు, మార్కెట్ కోసం 55 సెంట్ల భూమిని దానం చేయడం సంతోషకరమన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని విరమించుకోవాలి

రాయదుర్గం : వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాల్లో చేర్చాలనే నిర్ణయాన్ని పక్కన పెట్టి ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. లేనిపక్షంలో గిరిజనులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించుకోండి

రాయదుర్గం : పట్టణంలోని వ్యాపారులు తమ దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని రాయదుర్గం పోలీస్ ఇన్‌స్పెక్టర్ జె.జయనాయక్ సూచించారు. శనివారం పట్టణంలోని వినాయక కూడలిలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ దుకాణాల్లో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో నివారించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనివల్ల దొంగతనాలు తగ్గుముఖం పడతాయన్నారు. అంతేగాక ట్రాఫిక్ సమస్యలను నివారించవచ్చున్నారు.

మార్కండేయ స్వామి జయంతి

రాయదుర్గం : పట్టణంలోని భక్త మార్కండేయ స్వామి ఆలయంలో స్వామివారి జయంత్యోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న భక్త మార్కండేయ స్వామి ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి, పంచామత అభిషేకం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజారోహణం, పతాకావిష్కరణ, పద్మశాలీల ప్రతిజ్ఞ, పాలబావిలో గంగపూజ చేశారు.

చదరంగంలో రాణిస్తున్న సంజయ్‌సాహుల్

ప్రజాశక్తి-అనంతపురం

మొమెంటో, ప్రశంసాపత్రంతో సంజయ్ సాహుల్

ప్రపంచ చదరంగ సమాఖ్య (ఎఫ్ఐడిఇ), అఖిల భారత చదరంగ సమాఖ్య (ఎఐసిఎఫ్) సంయుక్తంగా శనివారం విడుదల చేసిన చదరంగ క్రీడాకారుల జాబితాలో జిల్లా చెస్ క్రీడాకారులు సత్తాచాటారు. ముఖ్యంగా 9ఏళ్ల పిడుగు సంజయ్ సాహుల్ అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. కేవలం 8-9 నెలల వ్యవధిలోనే ప్రపంచ చదరంగ సమాఖ్యతో మూడు విభాగాల్లోనూ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ సాధించాడు. 2024 వేసవి సెలవుల్లో చదరంగ శిక్షణ కోసం ఏ1 చెస్ అకాడమీ లో బేసిక్స్ ను సీనియర్ ఆర్బిటర్ గోవింద్ దగ్గర నేర్చుకోవడం మొదలుపెట్టాడు. అనతికాలంలోనే మెళకులపై పట్టు సాధిస్తూ ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్ నాయుడు ఆధ్వర్యం లో మరింత మెరుగ్గా చదరంగ సాధన చేశాడు. ఈ సందర్భంగా ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, ఛైర్మన్ బాలరాజు, కోశాధికారి కిషోర్‌కుమార్ నాయుడు, అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు, ఇంటర్నేషనల్ ఆర్బిటర్, తదితరులు క్రీడాకారుడిని అభినందించారు.

'ఫీజుపోరు' పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రయివేటు విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా, వసతిదీవెలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5వతేదీ నిర్వహించనున్న ఫీజుపోరు కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా భారీగా తరలిరావాలని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌యాదవ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి పిలుపునిచ్చారు. శనివారం అనంతపురంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రయివేటు కళాశాలల విద్యార్థులకు రూ.3,900 కోట్ల ఫీజు బకాయిలు ఉన్నాయన్నారు. వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతి, మహేశ్వరి, లక్ష్మి, వెంకట్, శేఖర్, అరవింద్, రాజేష్, కిషోర్ పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని రామస్వామి ఆలయంలో 'ఫీజుపోరు'కు సంబంధించిన పోస్టర్లను వైసిపి నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులునాయక్, జిల్లా అధికార ప్రతినిధి ఎన్‌వి.నారాయణ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయం వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన నిర్వహించనున్న ఫీజుపోరుకు సంబంధించిన పోస్టర్లను శనివారం రాయదుర్గంలోని నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు విద్యార్థుల విద్యాదీవెన, వసతిదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాళు శిల్ప, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, గోవిందు, నాగిరెడ్డి, భోజరాజునాయక్, శ్రీనివాసులు, శివ, దిలావర్‌బాషా, రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి బుక్‌స్టాల్ పున:ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

బుక్‌స్టాల్ భవనం
అధినేతలు రవికుమార్, లక్ష్మణ్‌బాబు

నగరంలోని టవర్ క్లాక్ కోర్టు రోడ్డు సర్కిల్‌లో ప్రెస్‌క్లబ్ ఎదురుగా నూతనంగా నిర్మించిన జ్యోతి బుక్‌స్టాల్ శనివారం పున: ప్రారంభమైంది. ఈ సందర్భంగా సంస్థ అధినేతలు ఎన్‌వి.రవికు మార్, ఎన్‌వి. లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ 56 సంవత్సరాలుగా అనంతపురం ప్రజలు తమను ఎంతగానో ఆదరిస్తున్నారని తెలిపారు. సుదీర్ఘకాలంగా పుస్తక ప్రపంచంలో ఎంతోమంది విద్యార్థులు, కస్టమర్లకు జ్యోతి బుక్‌స్టాల్ ద్వారా సేవలందించే బాధ్యత తమకు లభించటం సంతోషకరమన్నారు. ఇదే నిబద్ధతతో భవిష్యత్తులోనూ పుస్తకభాండాగారం ద్వారా సేవలు అందిస్తామన్నారు. ఎప్పటిలాగా అనంతపురం ప్రజలు తమను ఆదరించి, అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నగర సమీపంలోని సెంట్రల్‌పార్కులో ఉన్న శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురానికి చెందిన సంధ్యామూర్తి శిష్య బృందం నృత్య ప్రదర్శనలు చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5:30 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఉంటాయన్నారు.

ఆర్థికవ్యవస్థపై 'చెక్‌బౌన్స్' ప్రభావం

హైకోర్టు ప్రముఖ న్యాయవాది సుభాన్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

చెక్‌బౌన్స్ అనేది ఆర్థిక పరిశ్రమను ప్రభావితం చేసే అత్యంత ప్రబలమైన నేరాల్లో ఒకటని హైకోర్టు ప్రముఖ న్యాయవాది సుభాన్ తెలిపారు. చెక్‌బౌన్స్ పర్యావసానాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఎవరైనా సొమ్ముకు బదులుగా చెక్ జారీ చేసే అవకాశం ఉందన్నారు. బ్యాంక్ ఖాతాల్లో తగినన్నీ నిధులు ఉన్నాయో లేదో అని చెక్ చేసుకున్నా తర్వాత మాత్రమే చెక్ జారీ చేయాలన్నారు. ఇచ్చిన చెక్ ఏ కారణంతోనైనా బౌన్స్ అయితే చట్ట ప్రకారం పలు శిక్షలకు గురి కావాల్సి వస్తుందన్నారు. 1881 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ (ఎన్‌ఐఎ)లోని సెక్షన్ 138 ప్రకారం బెయిలబుల్, నాన్ బెయిలబుల్ వారెంట్‌ను కోర్టు జారీ చేస్తుందన్నారు. బౌన్స్‌చెక్ అనేది చెక్కు విలువ కంటే రెట్టింపు జరిమానా, రెండు సంవత్సరాల వరకు జైలుశిక్ష, రెండూ విధించదగిన నేరం అన్నారు. ఖాతాలో డబ్బులు లేకుండా చెక్ ఇస్తే 30 రోజుల్లోపు డ్రాయర్‌పై దావా వేయవచ్చు అన్నారు. ఈ చర్య భారతీయ చట్టం ప్రకారం, బెయిలబుల్ నేరం కిందకు వస్తుందన్నారు. చట్టపరమైన చర్యలను నివారించడానికి చెక్ మొత్తాన్ని చెల్లించాలి లేదా రక్షణ కోసం మీ చట్టపరమైన నోటీసుకు ప్రత్యుత్తరం ఇవ్వవచ్చు అన్నారు. విచారణ తుది దశకు చేరుకున్న తర్వాత నిందితుడు చెక్‌బౌన్స్‌కు నేరాన్ని అంగీకరిస్తే వారు కోర్టు నుంచి చట్టపరమైన జరిమానాతో పాటు బ్యాంకులు, ఇతర సంస్థల నుంచి అనేక జరిమానాలకు లోబడి ఉంటుందన్నారు. బౌన్స్ అయిన చెక్ మీ క్రెడిట్ స్కోర్‌ను కూడా ప్రభావితం చేస్తుందన్నారు. కేసు తుది విచారణ సమయంలో చెక్ మొత్తానికి వర్తించే వడ్డీ, ఖర్చులతో పాటు గడువులోగా చెక్కు మొత్తాన్ని చెల్లించడానికి డ్రాయర్ సిద్ధంగా ఉంటే కేసును ముగించే హక్కు కోర్టుకు ఉంటుందన్నారు.

ఆరోగ్యానికి నడక, పరుగు ముఖ్యం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే దైనందిన జీవితంలో కనీసం 30 నిమిషాలు నడకగానీ, పరుగుకానీ చాలా ముఖ్యమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శాప్, ఈగల్, అహుడా, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ భాగస్వామ్యంతో 'వీ వైబ్' సంస్థ నిర్వహించే అనంతపురం కోసం పరుగు కార్యక్రమానికి సంబంధించిన టీ షర్టు, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వి వైబ్ సంస్థ అధినేత సజ్జ రాఘవీణ, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి సుధాకర్, ఎస్‌వియు ఎన్ఎస్ఎస్, మీడియా కోఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపునకు సిసి మోకాలడ్డు..!

కంటెన్‌జెన్సీ బిల్లుల చెల్లింపునకు బ్రేక్ - నిబంధనల అమల్లో సచివాలయ ఉద్యోగి వింతధోరణి - ఉద్యోగి తీరుపై గుత్తేదారుల ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ వద్ద కాంట్రాక్టర్లు

నగరంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించేలా కమిషనర్ లాగిన్‌లోని ఫైళ్లను కదిలించాలని కాంట్రాక్టర్లు రోజుల తరబడి కార్పొరేషన్‌లో పడిగాపులు కాస్తున్నారు. అయినా ఫైళ్లు ముందుకు కదల్లేదు. కార్పొరేషన్ లో రెవెన్యూ శాఖకు చెందిన డిప్యూటీ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చూస్తున్నారు. కమిషనర్‌కు సీసీలుగా పని చేసేవారు గతంలో మున్సిపల్ ఆఫీస్‌కు సంబంధించిన ఉద్యోగులే ఉండేవారు. కమిషనర్‌గా మేఘ స్వరూప్ పనిచేస్తూ బదిలీపై వెళ్లే సమయంలో వారి స్థానంలో సచివాలయ ఉద్యోగుల నియామకం జరిగింది. ఈ ఇద్దరిలో ఒకరు అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నకు సీసీగాను, మరొకరు కమిషనర్ మల్లికార్జున్ రెడ్డికి సిసిగా వ్యవహరిస్తున్నారు. కమిషనర్ సిసిగా వ్యవహరించే సచివాలయ ఉద్యోగి నిబంధనలకు కొత్త భాష్యం చెబుతున్నట్లు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. కార్పొరేషన్‌లో చిన్నాచితక పనులు టెండర్లతో ప్రమేయం లేకుండా కమిషనర్ స్థాయిలో బిల్లులు మంజూరు చేసే అవకాశం ఉంటుంది. కమిషనర్లు, ఇంజినీరింగ్ తదితర విభాగాలకు అవసరమైన టాయిలెట్ సామగ్రి, ఎయిర్ ఫ్రెషర్ చైర్లకు అవసరమైన టవళ్లు తదితర సామగ్రిని సరఫరా చేసే కాంట్రాక్టర్లకు కంటిన్జెన్సీ కింద బిల్లులు మంజూరు చేసే అవకాశం ఉంది. వీటికి టెండర్ బిల్లులు ఎంబుక్ అసిస్టెంట్ ఇంజినీర్ల చేత రికార్డు చేయించి, వాటిని డిఈఈలు ఈఈల లాగిన్ల ద్వారా ఆమోదం తెలిపి, ఈ ఆఫీస్ ద్వారా వాటిని కమిషనర్ ఆమోదానికి పంపుతారు. గడచిన మూడు నెలలుగా ఈ ఆఫీసులో 500 ఫైళ్లు సిఎఫ్ఎంఎస్ కింద 200 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఫైళ్లు అక్కడే నిలవడంతో గడచిన పది నెలలుగా బిల్లులు రాక కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంటిన్‌జెన్సీ బిల్లులు రూ.50 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. కంటిన్‌జెన్సీ బిల్లులు కమిషనర్ లాగిన్‌లో బిల్ నంబర్ నమోదు చేస్తే వెంటనే వాటి వివరాలు ఆన్‌లైన్‌లోకి వస్తాయి. వాటికి ఆమోదముద్ర వేస్తే బిల్లుల చెల్లింపునకు మార్గం సగుమమం అవుతుంది. అయితే కార్పొరేషన్ ఉన్నతాధికారి సీసీ బిల్లుల చెల్లింపులో కొత్త నిబంధనలను తెరపైకి తెస్తున్నారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. టెండర్ ద్వారా నిర్వహించిన అభివద్ధి పనుల లాగే కంటిన్జెన్సీ బిల్లులు కూడా క్రమసంఖ్య ఆధారంగానే ఆమోదముద్ర పడుతుంది అనేలా సిసి ఫల్గుణ చెబుతున్నారు. ఎంబుక్‌లో నమోదైన ఫైళ్లకు క్రమసంఖ్య అవసరం గానీ, కంటిన్‌జెన్సీ కింద పెట్టే బిల్లులకు క్రమ సంఖ్య అవసరం లేదని చెబుతున్నా ఆయన పట్టించుకోవడం లేదు. ఇదే అభిప్రాయంలో కార్పొరేషన్ ఉన్నతాధికారి సైతం ఉండడంతో బిల్లులు మంజూరు కావడం లేదని కాంట్రాక్ట్ వర్గాలు వాపోతున్నాయి. సిసి ఫల్గుణ ఒంటెద్దు పోకడతో రెగ్యులర్ ఉద్యోగులైన అటెండర్లను సైతం ఇటీవల దూషించటంతో వారం రోజులు క్రితం వారంతా తిరగబడ్డారు. అటెండర్లు అంతా కలిసి కమిషనర్ మల్లికార్జున రెడ్డికి సిసి ఫల్గుణ వ్యవహార శైలిపై ఫిర్యాదు చేశారు.

ఉన్నతాధికారిని సైతం నిబంధనావళి విషయంలో సిసి తప్పుదోవ పట్టించటం వల్ల సాధారణ బిల్లులు కూడా విడుదల కాక కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టర్లు ఎవరైనా ముఖ్య అధికారులు, బయట వ్యక్తులతో సచివాలయ ఉద్యోగిని కాదని కమిషనర్‌కు సిఫార్సులు చేస్తే ఫైలు తన వద్దకు రాక తప్పదని సదరు సచివాలయ ఉద్యోగి బెదిరిస్తున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. సుదీర్ఘకాలం సర్వీసు ఉన్న ఉద్యోగుల కన్నా ఒక సచివాలయ ఉద్యోగికి అంతటి ప్రాధాన్యత ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. సదరు ఉద్యోగి వలన కమిషనర్ ప్రతిష్టకు భంగం వాటిల్లే పరిస్థితి కూడా ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కుక్కల పట్టివేత బిల్లుకు ఆమోదం..!!

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు విషయంలో నిబంధనల పేరుతో మోకాలడ్డు వేసే కార్పొరేషన్ సిబ్బంది వివాదాస్పద వీధి కుక్కల చికిత్సకు సంబంధించిన రూ.17 లక్షల బిల్లుల చెల్లింపునకు ఆమోదం తెలపడం విమర్శలు తావిస్తోంది. నగరంలో వీధికుక్కల పట్టివేత, చికిత్సల అంశం కొన్ని నెలలుగా వివాదంగా ఉంది. ఇందుకు సంబంధించిన బిల్లుల కేటాయింపులో గోల్‌మాల్ జరిగిదంటూ కార్పొరేటర్లు సైతం పలు సమావేశాల్లో దీనిపై అధికారులను నిలదీశారు. నగరంలో కుక్కల స్వైర విహారం కొనసాగుతుంటే వాటిని నిర్మూలించినట్లు తెలిపేలా అందుకు సంబంధించిన రూ.17 లక్షల బిల్లు ఆగమేఘాల మీద చెల్లించాలని కార్పొరేషన్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న కమిషనర్ మల్లికార్జున రెడ్డిని ఆదేశించినట్లు తెలుస్తోంది. సోమవారం నాటికి రూ.17 లక్షల బిల్లును రాజమండ్రి నుంచి వచ్చే వారికి అందించాలంటూ ఆదేశాలు అందాయి. ఓ వైపు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.2.20కోట్ల బిల్లులు ఇవ్వకుండా ఇలా వివాదాస్పదమైన కుక్కల బిల్లులు ఇవ్వడంపై గుత్తేదారులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఇప్పటికీ వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా అందుకు సంబంధించిన బిల్లును ఎలా చెల్లిస్తారంటూ కాంట్రాక్టర్లు మండిపడుతున్నారు. బిల్లుల చెల్లింపులో కొందరు కార్పొరేషన్ అధికారులు నిబంధనలకు చెల్లుచీటి చెప్పారనే విమర్శిస్తున్నారు. వివాదాస్పద బిల్లుల చెల్లింపుపై కలెక్టర్, అర్బన్ ఎమ్మెల్యే, మేయర్ స్పందించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

ఇంటింటికీ ఫీవర్ సర్వే తనిఖీ

యాడికి : మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలో చేపట్టిన ఫీవర్ సర్వేను తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు తనిఖీ చేశారు. అనంతరం అంగన్వాడీ సెంటర్‌లో పిల్లలకు వడ్డించే మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎఎన్ఎం స్వర్ణలత, ఆశా కార్యకర్తలు పద్మావతి, వరలక్ష్మి, అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యాడికి : 1981-82లో విద్యను అభ్యసించిన విద్యార్థులు ఆదివారం యాడికి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు పూర్వ విద్యార్థులు ఆనంద్, మోహన్, గంగరాజు, ఒఆర్ చంద్రమోహన్, భోగేశ్వర్‌రెడ్డి, శశిధర్, శ్రీధర్, మద్దాల భాస్కర్, సంజీవరెడ్డి, వాసు, వనజ, స్వర్ణ మంజుల, నారమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 42ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలవనున్నారు.

సిఐని కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

యాడికి : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈరన్నను ఎపి ఎంఆర్‌పిఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా సిఐను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు, ఎస్సీ, ఎస్టీ జెఎసి సీనియర్ నాయకులు రాయలచెరువు మహేష్, కమ్మగిరి, మస్తాన్, కొండూరు బబ్లూ, సూర్యనారాయణ, విశ్వం, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్రోస్కోప్ అందజేత

రాయదుర్గం : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ ల్యాబ్ టెక్నీషియన్, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి కంబ్లీ తిప్పేస్వామి రూ.75వేలు విలువజేసే మైక్రోస్కోప్, ల్యాబ్ పరికరాలను శనివారం విరాళంగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.జయప్రదకు అందజేశారు.

ఆర్థికసాయం

అనంతపురం : ఇటీవల మృతిచెందిన నగర సమీపంలోని ప్రభాకర్‌చౌదరి కాలనీలో నివాసం ఉంటున్న శంకర్‌రెడ్డి కుటుంబానికి సాయిట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఆర్థికసాయం అందజేశారు. ఇందులో భాగంగా మృతుడి భార్య వై.రుక్మిణికి రూ.7,500 మొత్తాన్ని సాయిట్రస్టు అధ్యక్షులు విజయసాయి కుమార్ అందించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి కుమారుడు మధుకర్ చౌదరి రూ.5వేలు, చంద్రమోహన్‌రెడ్డి, నవయువ భారత్ ట్రస్టు రూ.2500 సాయం చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి అశ్వర్థ నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

పెద్దపప్పూరు : మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భవానీ భీమలింగేశ్వర స్వామి బ్రహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్తర, దక్షిణం ప్రవహించే పెన్నానది ఒడ్డున వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం అశ్వర్థ ఆలయంలో ప్రతిఏడు మాఘమాసం బ్రహ్మోత్సవాలను వైభవంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా స్వామివార్లకు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి దంపతులు శనివారం మంగళ వాయిద్యాలు నడుమ పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో అశ్వర్థ నారాయణస్వామి, చక్ర భీమలింగేశ్వర స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కేబుల్ వైర్ చోరీ

శింగనమల : మండల పరిధిలోని శోధనపల్లి గ్రామంలోని తోటల్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ కేబుల్ వైర్లు, డ్రిప్ పైపులు చోరీ చేశారు. నెలరోజుల క్రితం ఇదే గ్రామంలో విద్యుత్ కేబుల్ వైర్లు చోరీ చేశారు. మరోసారి దొంగలు చోరీకి పాల్పడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికే పెరిగిన పంట పెట్టుబడులు, గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రనష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు కేబుల్ వైర్ల చోరీ మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి కేబుల్ వైర్ చోరీ చేసే దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయ మోటార్ల దొంగలు అరెస్టు

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులోని రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లను దొంగలించిన నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. గ్రామానికి చెందిన ముగ్గురు రైతుల పొలాల్లో అమర్చిన మోటార్లను గుత్తికి చెందిన వన్నూరుస్వామి, యర్రగుడ్డి గ్రామానికి చెందిన ఓబులేసు, పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన తలారి సుధీర్ కలిసి ఎత్తుకెళ్లారు. వీటిని గుజిరీ వ్యాపారి వన్నూరుస్వామికి విక్రయించారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు సీఐ రామసుబ్బయ్య పర్యవేక్షణలో కేసును దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కే పంపడంతోపాటు మూడు వ్యవసాయ మోటార్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.